క్లుప్తంగా

కార్మెల్ మాతకు పూజలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్ కొండపై నున్న కార్మెల్ మాతను ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. పలు ప్రాంతాల నుంచి రైలు, బస్సులు, వాహనాల ద్వారా వచ్చిన భక్తులు కొండ ఎక్కారు. కొండపై తలనీలాలు సమర్పించారు. కార్మెల్ మాతను దర్శించుకొని కొబ్బరికాయలు కొట్టి, కొవ్వొత్తులు వెలిగించి, మొక్కులు చెల్లించుకున్నారు.

కోర్టుల తీర్పులను ప్రభుత్వం అమలు చేయాలి



తాడేపల్లిరూరల్ : ఏసీసీ కార్మికులకు అనుకూలంగా కోర్టులు ఇచ్చిన తీర్పులను ప్రభుత్వం అమలు చేయాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు అన్నారు. ఆదివారం బ్రహ్మానందపురంలో సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 300 కార్మిక కుటుంబాలతో ముడిపడినున్న సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, బి.అంకయ్య, వెంకటేశ్వర్లు, ఎస్.సుబ్బారావు, మాణిక్యరావు, దానయ్య, రమాదేవి, నవనీతం పాల్గొన్నారు.

ప్రార్థనతోనే పాపాలు దూరం



ఫిరంగిపురం: ప్రతి ఒక్కరూ దేవుడిని ప్రార్థించడం ద్వారానే తమ పాపాలు దూరం అవుతాయని ఫాదర్ టి.రాజా సురేష్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బాలఏసు దేవాలయంలో ఆదివారం దివ్యపూజాబలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ టి.రాజా సురేష్‌రెడ్డి వాక్యోపదేశం చేస్తూ దేవుడి ఆజ్ఞతోనే ప్రతి పనిని చేసి విజయం సాధించగలుగుతామన్నారు. భగవంతుడుని ప్రార్థించడం ద్వారా మనకు సరైన మార్గాన్ని చూపాతాడన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ విచారణ గురువులు ఎం.ఫాతిమా మర్రెడ్డి, కథోళిక క్రైస్తవులు పాల్గొన్నారు.

వరిగడ్డి వామికి నిప్పు



తాడికొండ: వరిగడ్డి వామికి నిప్పంటుకుని మంటలు రేగిన ఘటన మండల కేంద్రంలో జరిగింది. వివరాల మేరకు.. గ్రామంలోని ప్రధాన రహదారి వెంట మూలస్థానేశ్వర స్వామి ఆలయం పక్కన ఉన్న గోశాలలో పశువుల మేత కోసం వరిగడ్డిని నిల్వ చేశారు. ఈ వరిగడ్డి వామికి ఆదివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో మంటలు చెలరేగాయి. స్థానికులు మంటలు ఆర్పేందుకు యత్నించగా అదుపులోకి రాకపోవడంతో ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సచివాలయ ఫైర్ స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలార్పేందుకు రెండు గంటలకు పైగా సమయం వెచ్చించారు. ఈ ప్రమాదంలో రూ.20 వేలు విలువ చేసే వరిగడ్డి తగలబడినట్లు స్థానికులు చెబుతున్నారు.

అనాథ శరణాలయానికి నిత్యావసరాల వితరణ



చినకాకాని(మంగళగిరి): విజయవాడ చిట్టినగర్ గౌతమ్ స్కూలు ఆధ్వర్యంలో శ్రీ షిర్డి సాయి సేవా సమితి అధ్యక్షుడు కృష్ణ శేఖర్ సహకారంతో అనాథ ఆశ్రమానికి రూ.30 వేల విలువైన నిత్యావసర సరకులు అందజేశారు. ఆదివారం నగర పరిధిలోని చినకాకాని షైన్ అనాథ ఆశ్రమానికి అందజేయగా ఆశ్రమ నిర్వాహకులు డీజీ నాయక్ దాతల చేతుల మీదుగా సరకులు అందుకుని వారికి ధన్యవాదాలు తెలిపారు.

అనుమతులు లేవు..కట్టడాలున్నాయి..!

- అక్రమ నిర్మాణాలకు కేరాఫ్‌గా ఎంటీఎంసీ
- వాగు పోరంబోకు ఆక్రమించి నాలుగు అంతస్తుల భవన నిర్మాణం
- మంత్రి అనుచరుడి ఆశీస్సులతో నిర్భయంగా ఆక్రమణ
- అధికారుల అండతోనే రెచ్చిపోతున్న టీడీపీ నాయకులు



జాతీయ రహదారి పక్కన వాగు పోరంబోకు స్థలంలో అనుమతి లేకుండా కట్టిన భవనం

మంగళగిరి: మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారింది. టీడీపీ కార్యాలయంలోని నాయకులు ఆశీస్సులుంటే చాలు ఎలాంటి అనుమతులు లేకపోయినా ప్రభుత్వ భూములను ఆక్రమించి, నిర్మించినా అధికారులు పట్టించుకోరనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జాతీయ రహదారి ఆనుకుని ఏపీఎస్పీ బెటాలియన్ పక్కన టీడీపీ నాయకుడు వాగు పోరంబోకు సర్వే నంబరు 353/3లోని భూమిని ఆక్రమించి మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా పెద్ద భవనం నిర్మించాడు. కానీ, కార్పొరేషన్ పట్టణ పట్టణ ప్రణాళికా విభాగం, సీఆర్‌డీఏ అధికారులకు ఇది కనిపించకపోవడం విశేషం. జాతీయ రహదారి వెంట ఆక్రమించిన పోరంబోకు భూమి విలువ సుమారు రూ.30లక్షలు ఉంటుంది. మంత్రి అనుచరుడి ఆశీస్సులు ఉండడంతో అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అనుమతులెక్కడ..?

ఇక నగరంలో గత కొద్ది కాలంగా అనుమతులు లేకుండా వందల సంఖ్యలో భవనాల నిర్మాణాలు చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పట్టణ ప్రణాళిక విభాగం ప్రత్యేకంగా మున్సిపల్ స్థలాల ఆక్రమణ, అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు సిబ్బందిని ఏర్పాటు చేసింది. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అనుమతులు లేని అక్రమ నిర్మాణాలను పునాది స్థాయిలో అడ్డుకునేవారు. దీంతో నిర్మాణదారులు వెంటనే కార్పొరేషన్ నుంచి అనుమతులు తీసుకుని భవన నిర్మాణాలు చేపట్టారు. ఎంటీఎంసీ పరిధిలో సుమారు 1,200కుపైగా అనుమతులు లేని భవనాలు ఉన్నట్లు అధికారులు గుర్తించి, నోటీసులు జారీ చేశారు. వీటిలో కొందరు భవన యజమానులు అనుమతుల కొరకు దరఖాస్తులు చేసుకోగా.. మరి కొందరిలో ఎలాంటి చలనం లేకపోవడంతో అధికారులు చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు. అనుమతులు లేని భవన నిర్మాణదారులు ఇప్పటికైనా స్పందించి అనుమతులు తీసుకుని కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని అధికారులు కోరుతున్నారు. కమిషనర్ ఆలీంబాషా మాట్లాడుతూ నగర పాలక సంస్థలో నిర్మాణాలు చేపట్టేవారు సీఆర్డీఏ నుంచి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. జాతీయ రహదారి వెంట అనుమతులు లేని భవనం గురించి పట్టణ ప్రణాళికా విభాగం అధికారులతో విచారిస్తామన్నారు. అనుమతులు లేకపోతే తప్పకుండా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకునేలా చర్యలు తీసుకుంటామని, భవన నిర్మాణదారులు నిర్మాణానికి ముందే అనుమతులు తీసుకుని కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని కోరారు.



మంగళగిరి ఏరియల్ వ్యూ

నులి పురుగులను నులిపేద్దాం



నులిపురుగుల నివారణపై రూపొందించిన వాల్‌పోస్టర్

- నేడు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం
- 2-19 ఏళ్లలోపు 47,792 మందికి మాత్రల పంపిణీ

మంగళగిరి టౌన్ : చిన్నారులను పీడించే అనారోగ్య సమస్యల్లో నులిపురుగులు ప్రధానమైనవి. ఈ పురుగులు కడుపులోచేరి మెలిపెట్టడం వల్ల పిల్లల్లో పీలతనం, నీరసం, ఆహారం సరిగా తీసుకోకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. క్రమంగా రక్తహీనతకు దారితీస్తాయి. ఈ నులి పురుగులను ఒకే ఒక్క మాత్ర ఆల్బెండజోల్‌తో నివారించవచ్చు. ఈ నేపథ్యంలోనే వైద్య శాఖ ఏడాదికి రెండుసార్లు జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాలు నిర్వహించి, ఆల్బెండజోల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేస్తోంది. సోమవారం జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీలు, పాఠశాలలు, జూనియర్ కళాశాలలోని 2 నుంచి 19 ఏళ్లలోపు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఏడాది నుంచి రెండేళ్లలోపు చిన్నారులకు ఆల్బెండజోన్ సగం మాత్ర నీటితో కలిపి తాగించాలి. 2 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు మాత్రను మధ్యాహ్నం భోజనం తరువాత చప్పరింపజేయాలి.

మాత్రలు ఖచ్చితంగా వేసుకునేలా చూడాలి



ఆల్బెండజోల్ మాత్రలను మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత మాత్రమే విద్యార్థులకు ఇవ్వాలి. మాత్ర తీసుకున్న తర్వాత ఏ విధమైన ఇబ్బందులు ఎదురైనా వెంటనే దగ్గరలోని వైద్యులను సంప్రదించాలి. పీహెచ్సీ పరిధిలోని అంగన్‌వాడీ, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు అందించనున్నాం. పిల్లల తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పిల్లలు వాటిని తీసుకునేలా చూడాలి.

– డాక్టర్ అనూష, ఇందిరా నగర్, యూపీహెచ్‌సీ

53,000 మాత్రలు...

మంగళగిరి నగరపరిధిలోని మంగళగిరి, తాడేపల్లి మండలాల్లో 19 ఏళ్లలోపు చిన్నారులు 47,792 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మంగళగిరి, తాడేపల్లి పరిధిలో 9 యూపీహెచ్‌సీలు, 3 పీహెచ్‌సీలు ఉన్నాయి. ఈ ఆరోగ్యకేంద్రాల సెంటర్ పరిధిలో ఉన్న అంగన్‌వాడీలు, పాఠశాలలు, కాలేజీ పరిధిలో ఉన్న 19 ఏళ్లలోపు పిల్లలకు 53 వేల ఆల్బెండజోల్ మాత్రలు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు వైద్యశాఖ అధికారులు తెలిపారు. ఇందుకోసం అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నారు. ఏదైనా పరిస్థితుల దృష్ట్యా మాత్రలు తీసుకోనివారికి ఈ నెల 17వ తేదీ మరోమారు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మాత్రలు అందజేయనున్నారు.

ఇళ్ల స్థలాలిచ్చే వరకు పోరాటం



మంగళగిరి టౌన్: పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు ప్రభుత్వం నుంచి వచ్చే వరకు ప్రజల తరుపున పోరాడతామని సీపీఐ మంగళగిరి పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ అన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని శాలివాహన పేటలో ఆదివారం పేద ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రభాకర్ మాట్లాడుతూ నిరుపేదలకు ఇళ్ల స్థలాలు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇవ్వాలన్నారు. ఈ మేరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శి నందం బ్రహ్మేశరరావు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి



చినకాకాని(మంగళగిరి): నిబంధనలు పాటించకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని రూరల్ సీఐ వై శ్రీనివాసరావు హెచ్చరించారు. ఆదివారం నగర పరిధిలోని చినకాకాని ఎన్‌ఆర్‌ఐ జంక్షన్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. నిబంధనలు పాటించని వాహనాల యజమానులుకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ద్విచక్రవాహన యజమానులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి ప్యాసింజర్లు ఎక్కించకూడదన్నారు. కారు డ్రైవింగ్ చేసేవారు తప్పనిసరిగా సీటు బెల్ట్ ధరించాల్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు.

గండాలయ్య పేటలో ఉచిత వైద్య శిబిరం

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ పరిధిలోని గండాలయ్యపేటలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సత్యసాయి భజన మండలి, డీవైఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో 100 మందికి పైగా వైద్య సేవలు వినియోగించుకున్నారు. సాధారణ వైద్య సేవలు, డెంటల్, స్త్రీలకు సంబంధించిన వ్యాధులకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వైద్యులు మాజేటి వంశీకృష్ణ, ఎస్. మాధవీలత, కృష్ణ చైతన్య, శ్రీ సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర మెడికల ఇన్‌చార్జి పూసపాటి సాయికృష్ణ, పట్టణ సత్యసాయి భజన మండలి కన్వీనర్ డాక్టర్ రామారావు, సీపీఎం నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, డీవైఎఫ్ నాయకులు నాగేశ్వరరావు, చైతన్య, భజన మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఐ రవీంద్రనాయక్

మంగళగిరి టౌన్: రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగకుంటే చర్యలు తప్పవని మంగళగిరి పట్టణ ఎస్ఐ రవీంద్రనాయక్ హెచ్చరించారు. నగర పరిధిలోని రౌడీ షీటర్లకు ఆదివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర నాయక్ మాట్లాడుతూ అల్లర్లకు, అలజడులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. చెడు నడత కలిగిన రౌడీషీటర్లపై పోలీసుల నిఘా ఉంటుందని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రౌడీషీట్ నమోదైన ప్రతి ఒక్కరు స్టేషన్‌లో సంతకాలు చేస్తుండాలని చెప్పారు. బయట ప్రాంతాలకు వెళ్లే సమయంలో స్టేషన్ అధికారి అనుమతి తప్పని సరిగా తీసుకోవాలని సూచించారు. రౌడీషీటర్ల కదలికలపై అనుమానం వస్తే వెంటనే అదుపులోకి తీసుకుని బైండోవర్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ సిబ్బంది ఏడుకొండలు, బాబూరావు, సుధీర్, శ్రీరామ్ పాల్గొన్నారు.

లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం



ప్రచారంలో ప్రజా సంఘాల నాయకులు

తాడేపల్లిరూరల్ : కృష్ణా గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పీడీఎస్ తరుపున ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ ప్రజా సంఘాల నాయకులు ఆదివారం తాడేపల్లిలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ గ్రాడ్యుయేట్స్ ఓటర్లను కలసి ఓట్లను అభ్యర్థించారు. కార్మిక, కర్షక ప్రజా సమస్యలపై చట్టసభల్లో తన గళం వినిపిస్తున్న లక్ష్మణరావును గెలిపించుకోవాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రజా సంఘాల నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాస్ కుమారి, వేముల దుర్గారావు, కోట బాబూరావు, దర్శనపు విజయ్‌బాబు, లీలమ్మ, గోపమ్మ, నరసింహారావు, ఎస్. దుర్గారావు, రాజు పాల్గొన్నారు.

గౌరవ వేతన బకాయిలు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న షేక్ సుభాని

తాడేపల్లిరూరల్ : ఆదాయం లేని మసీదులకు రాష్ట్ర ప్రభుత్వం ఇమామ్, మౌజనులకు ఇచ్చే గౌరవ వేతనం త్వరగా విడుదల చేయాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని విజ్ఞప్తి చేశారు. ఆదివారం దుగ్గిరాల ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇమామ్, మౌజన్‌ల గౌరవ వేతనాలు అందించడంలో గతంలో ఎన్నడూ లేని తీవ్రమైన జాప్యం కూటమి ప్రభుత్వం ప్రదర్శిస్తోందన్నారు. నిధులు విడుదల విషయంలో నెలల తరబడి జాప్యం చేస్తే మసీదుల నిర్వహణ ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. గత తొమ్మిది నెలలుగా గౌరవ వేతనాలు లేక ఇమామ్, మౌజన్‌లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గౌరవ వేతనాలకు రెట్టింపు చేసి 5 వేలు ఉన్న ఇమామ్ గౌరవ వేతనాన్ని రూ.10 వేలకు, 3 వేలుగా ఉన్న మౌజన్ గౌరవ వేతనాన్ని రూ.5 వేలకు పెంచి క్రమం తప్పకుండా ఇచ్చారన్నారు. నెల రోజుల్లో పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం కానున్నదని గౌరవ వేతన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో మైనార్టీ నేతలు షేక్ రషీద్ సాహెబ్, షేక్‌రహమాన్ సాహెబ్ పాల్గొన్నారు.

దేశంలో ఫాసిజం పెరిగిపోతోంది



మాట్లాడుతున్న డాక్టర్ ఎస్.తిరుపతయ్య

మంగళగిరి:దేశంలో ఫాసిజం రోజు రోజుకు పెరిగిపోతోందని తెలంగాణ మానవ హక్కుల వేదిక అధ్యక్షుడు డాక్టర్ ఎస్.తిరుపతయ్య పేర్కొన్నారు. నగర పరిధిలోని నిడమర్రు చార్వాక ఆశ్రమంలో రెండు రోజులు పాటు నాస్తికా మేళా ఆదివారంతో ముగిసింది. జన విజ్ఞాన జాతీయ అధ్యక్షురాలు ఎస్.స్వరాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగన సమావేశంలో వక్తలు మాట్లాడారు. భారత దేశంలో ఫాసిజం అనే అంశంపై డాక్టర్ తిరుపతయ్య మాట్లాడుతూ ఫాసిజం పెరగడంతో ప్రజాస్వామ్య హక్కులు హరించబడుతున్నాయన్నారు. మతం పేరుతో మైనార్టీలపై దాడులు చేస్తున్నారని, స్త్రీల హక్కులు అణిచివేయబడుతున్నాయన్నారు. హక్కుల గురించి ప్రశ్నించిన వారిని జైలులో పెడుతున్నారని విమర్శించారు. పెరుగుతున్న ఫాసిజం మన కర్తవ్యాలు అను అంశంపై విద్యాపరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ రమేష్ పట్నాయక్ మాట్లాడుతూ పాలకులు అన్ని రంగాలను తమ గుప్పిట్లో పెట్టుకుని ప్రజల మధ్య కుల, మత చిచ్చు పెడుతున్నారన్నారు. కుల నిర్మూలన పోరాట జాతీయ నాయకుడు కృష్ణ మాట్లాడుతూ ఈ దేశంలో కులం లేని జాగా అంటూ లేదన్నారు.కుల దోపిడికి వ్యతిరకంగా ప్రజలను చైతన్యవంతులను చేసి వారిలో అవగాహన పెంచాల్సిన అవసరం వుందన్నారు.

నేటి నుంచి 'పది' ప్రీ ఫైనల్

పరీక్షలకు హాజరు కానున్న 1,803 మంది విద్యార్థులు



పరీక్షలకు సన్నద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులు

మంగళగిరి టౌన్ : పదవ తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని మంగళగిరి ఎంఈఓ ఎస్.బాబు ఆదివారం తెలిపారు. సోమవారం ఈ నెల 20వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు. విద్యార్థులు తప్పని సరిగా ప్రీ ఫైనల్‌కు హాజరు కావాలన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. మంగళగిరి మండల పరిధిలో ఎయిడెడ్ -3, జెడ్పీ -6, మున్సిపల్ -3 పాఠశాలల నుంచి 730 మంది, 19 ప్రైవేటు పాఠశాలల నుంచి 1,073 మంది.. మొత్తం 1,803 మంది ప్రీ ఫైనల్స్‌కు హాజరు కావాల్సి ఉందన్నారు. అన్ని పాఠశాలల్లో ఏర్పాట్లు చేశామని, ప్రతి పాఠశాలకు పరీక్ష గంట ముందు మాత్రమే ప్రశ్న పత్రాలు పంపించడం జరుగుతుందన్నారు.

ప్రజా సమస్యలపై లక్ష్మణరావు నిరంతర పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

తాడేపల్లిరూరల్: ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సామాన్య ప్రజానీకం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న ప్రస్తుత ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావును మళ్లీ గెలిపించుకునేలా కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాశం రామారావు అన్నారు. ఆదివారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లిలో రైతు సంఘం నాయకులు అమ్మిశెట్టి రంగారావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ గత మూడు సార్లు శాసనమండలి సభ్యుడిగా పనిచేస్తూ, నీతి నిజాయితీకి మారుపేరుగా అన్ని వర్గాల ప్రజల మన్ననలు లక్ష్మణరావు పొందారన్నారు. ప్రజల గొంతుకై శాసన మండలిలో తన గొంతును వినిపిస్తున్నారని అన్నారు. కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, రైతు సంఘం నాయకులు రాజేంద్రబాబు, కంచర్ల జేమ్స్, శ్రీనివాసరావు, విజయరాజు, భార్గవ్, సుధాకర్, సామ్యవాదం, మరియదాసు పాల్గొన్నారు.

ప్రమాదాలకు కేరాఫ్...పేరేచర్ల డొంక



పేరేచర్ల డొంకలో వాహనాల రాకపోకలు

మేడికొండూరు: స్థానిక పేరేచర్ల కూడలి నుంచి గుంటూరు వైపు వెళ్లే ఫ్లైఓవర్ కిందనున్న డొంక ప్రమాదాలకు కేరాఫ్‌గా మారింది. గత 15 ఏళ్ల క్రితం గుంటూరు రోడ్డులో రైల్వేట్రాక్‌పై ఫ్లైఓవర్ నిర్మించారు. అప్పటిలో కొంత మేర వంతెనకు ఇరువైపులా డివైడర్లు నిర్మించి వదిలివేశారు. పేరేచర్ల డొంక ప్రాంతంలో కొంత మేర డివైడర్లను ఆర్అండ్‌బీ అధికారులు పెంచడంతో గుంటూరు నుంచి వచ్చే వాహనాలు, నర్సారావుపేట వైపు వెళ్లే వాహనాలు ఒకేసారి రావడంతో వాహనదారులకు అర్థం కాని పరిస్థితి ఏర్పాడింది. ఎదురెదురుగా వాహనాలు రావడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. అంతే కాకుండా ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రయాణికు గాయపడిన ఘటనలు అనేకం. పేరేచర్ల డొంక ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



కొప్పుల రాజు (ఫైల్ ఫొటో)

మంగళగిరి టౌన్: దొండపాడుకు చెందిన ఉపాధ్యాయుడు కొప్పుల రాజు (50) అకస్మాత్తుగా ఆదివారం సాయంత్రం గుండెపోటుతో దొండపాడులోని ఆయన నివాసంలో మృతి చెందారు. ఆయన మంగళగిరి నగర పరిధిలోని కాంద్రు కమల మున్సిపల్ పాఠశాలలో సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా 24 సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. విషయం తెలుసుకున్న తోటి ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు, మంగళగిరి ఎంఈఓ ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతదేహానికి నివాళులర్పించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సోమవారం స్వగ్రామం దొండపాడులో అంత్యక్రియలు జరుగనున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. మంగళగిరి ఎంఈఓ బాబు, ప్రధానోపాధ్యాయులు దరియావలి, శ్రీనివాసరావు, సైదా నాయక్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు నివాళులర్పించారు.

గుంతలతో వాహనదారులకు ఇక్కట్లు

ఫిరంగిపురం: మండల కేంద్రం నుంచి సొలస వైపు వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతింది. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో గ్రామ శివారులో ఉన్న రోడ్డును కొంత దూరం చదును చేశారు. రోడ్డు వేయకపోవడంతో చదును చేసిన ప్రాంతంలో ప్రయాణించేందుకు వాహనదారులు నానా ఇక్కట్లు పడుతున్నారు. రోడ్డుపై కొన్ని చోట్ల పెద్దపెద్ద గుంతలు ఏర్పడి దూరంగా వచ్చేవారికి కన్పించకపోవడంతో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. కొన్నిచోట్ల గతంలో ఉన్న తారు రోడ్డు మార్జిన్ కోసుకుపోవడంతో ఎదురు ఎదురుగా వాహనాలు వచ్చిన సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు చెబుతున్నారు.రాత్రిళ్లు ప్రమాదాల తీవ్రత ఎక్కువగా ఉంటుందని అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు స్పందించి రోడ్డునకు మరమ్మతులు నిర్వహించాలని తెలిపారు.



ఎగుడుదిగుడుగా ఉన్న సొలస రోడ్డు



హౌస్ గణేష్‌వద్ద దెబ్బతిన్న రోడ్డు మార్జిన్

బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా నాగేశ్వరరావు



మంగళగిరి టౌన్: బీజేపీ మంగళగిరి పట్టణ అధ్యక్షుడిగా మునగాల నాగేశ్వరరావును నియమిస్తూ ఆదివారం బీజేపీ జిల్లా కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. పట్టణ బీజేపీ కార్యాలయంలో నాగేశ్వరరావును పలువురు నాయకులు కలసి శాలువాతో సత్కరించి, అభినందించారు. ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకువెళ్లి, మంగళగిరి పట్టణంలో పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పంచుమర్తి ప్రసాద్, రాష్ట్ర వీవర్స్ సెల్ కన్వీనర్ జగ్గారపు శ్రీనివాసరావు, నాయకులు జవ్వాది అమ్మయ్య, ఈశ్వర్‌నాయుడు, రాధాకృష్ణ పాల్గొన్నారు.